రంజాన్ వేళలు
ఇఫ్తార్:-6:34 (బుధవారం సాయంత్రం)
సహర్: 5:01 (గురువారం ఉదయం)

నిధుల వరద పారేనా?



- మందకొడిగా సాగుతున్న ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులు
- గతంలో సమీక్ష నిర్వహించినా.. నిధుల మంజూరు అంతంతే...
- ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకంపై ఆశలు
- ఈసారైనా పాలమూరు యూనివర్సిటీకి అధిక నిధులు వచ్చేనా?
- కొత్త రిజర్వాయర్లు, లిఫ్టులు మంజూరుపై ఎమ్మెల్యేల వినతి
- నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనుల నిధులకు డిమాండ్లు



మహబూబ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కేంద్రంలో మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రవేశపెడుతున్న పూర్తిస్థాయి బడ్జెట్ ఇది.. గత రెండు బడ్జెట్‌లలో తెలంగాణకు కేంద్రం కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు చేసింది. ఓ మారు అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు. ప్రధానంగా రైల్వే ప్రాజెక్టులు, నవోదయ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తదితర అంశాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో.. ప్రజల్లో ఆసక్తి నెలకొంది. అలాగే ఆరు గ్యారంటీల్లో భాగంగా కొన్ని పథకాలకు ఇప్పటివరకు నిధులు కేటాయించ లేదు. మరికొన్ని మందకొడిగా సాగుతున్నాయి. అలాగే అభివృద్ధి పనులు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులపై డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో వాటన్నింటికీ మోక్షం లభించాలనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు సంబంధించి అభివృద్ధి పనులకు పలు సభల్లో గ్రీన్ చానల్ ద్వారా నిధులు అందిస్తామని, సంవత్సరానికి రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా కొంతకాలంగా సాగునీటి ప్రాజెక్టుల పనులు ఉమ్మడి జిల్లాలో మందకొడిగా సాగుతున్నాయి. గత సంవత్సరం సీఎం సమీక్ష చేసి.. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడలేదు. ఈ నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులతోపాటు అభివృద్ధి పనులకు నిధుల వరద ఈ బడ్జెట్‌లోనైనా పారుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితేంటి?

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు, డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్ ఛానళ్ల నిర్మాణం తదితర పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న డిజైన్ ప్రకారం పూర్తి ఆయకట్టుకు నీరందించాలంటే మరో రూ.377 కోట్లు అవసరం.

- నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి. ఇప్పటివరకు రూ.2,503 కోట్లు ఖర్చు చేయగా, పూర్తి చేయడానికి రూ.231.36 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. గత సంవత్సరం రూ.105 కోట్లు కేటాయింపులు చేసినా.. అవి రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు మాత్రమే సరిపోయాయి. అలాగే ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల కారణంగా పూర్తి ఆయకట్టుకు నీరివ్వలేని పరిస్థితి ఉంది. దీనికి మరో రూ.142 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు.
- భీమా ఎత్తిపోతల పథకాన్ని రెండు దశలుగా చేపట్టారు. భీమా 1 ద్వారా 1.11 లక్షల ఎకరాలు, భీమా-2 ద్వారా 2.03 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉంది. ప్రాజెక్టు ప్రారంభ

(మిగతా 7లో..)


పాలమూరు యూనివర్సిటీ

నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం

- బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు
- విద్య, రోడ్లు, ప్రాజెక్టుల పనుల కోసం విన్నవిస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు

7

బదిలీ చేయండి


రెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం

- ట్రాన్స్‌ఫర్ కోసం పంచాయతీ కార్యదర్శుల దరఖాస్తులు
- కొందరు వ్యక్తిగతంగా.. మాట వినడం లేదని మరికొందరిని మార్చాలంటున్న కాంగ్రెస్ నాయకులు
- ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో ప్రయత్నాలు
- గండీడ్ మండలం నుంచి 10 మంది కార్యదర్శుల బదిలీలకు లేఖలు

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆకస్మిక బదిలీల సమస్య వచ్చి పడింది. కొందరు కార్యదర్శులు వ్యక్తిగతంగా ఖాళీలు ఉన్న చోటుకు బదిలీ చేయాలని దరఖాస్తులు చేసుకుంటుండగా, మరికొందరు కార్యదర్శులు తాము పని చేస్తున్న స్థానం దూరంగా ఉండటంతో బదిలీలకు ప్రయత్నిస్తున్నారు. ఇంకొన్ని మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు తమ మాట వినడం లేదని అధికార పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి వారికి అనుకూలంగా ఉండే వారిని నియమించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దాంతో ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని డీపీవో కార్యాలయానికి ఒత్తిళ్లు వస్తున్నాయి. బదిలీల్లో మండల నాయకులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గండీడ్ మండలం నుంచే 10 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని ఎమ్మెల్యే సిఫార్సులతో కూడిన ఫైళ్లు డీపీవో కార్యాలయానికి వచ్చాయి. ఆ ఫైళ్లను ఏవో డీపీవోకు ఫార్వర్డ్ చేశారు. డీపీవో బదిలీల ఫైళ్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు పంపించారు. అక్కడి నుంచి కలెక్టర్ వద్దకు వెళ్లి సంతకం చేస్తే.. బదిలీలు అవుతాయి. ఎవరికి నచ్చిన చోటుకు వారు పైరవీల ద్వారా బదిలీలకు ప్రయత్నిస్తుండటంతో విధులను సక్రమంగా నిర్వర్తించే కార్యదర్శులు నష్టపోనున్నారు.

2024లోనే సాధారణ బదిలీలు

జిల్లాలోని 423 పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులోనే సాధారణ బదిలీలు చేపట్టింది. వారు గతంలో పని చేసిన ప్రాంతాలలో వారి రికార్డు ఆధారంగా బదిలీలు చేపట్టారు. సస్పెండ్ అయిన కాలంలో ఇచ్చిన మెమోలకు సరైన జవాబులు ఇవ్వని వారు, ఫైల్స్ క్లియర్ కాని కార్యదర్శులు మాత్రమే బదిలీలు కాలేదు. మిగిలిన గ్రేడ్ -1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్ -4, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు అయ్యాయి. బదిలీలు కాని వారు రెండు నెలల క్రితమే డీపీవో కార్యాలయంలో తమను బదిలీ చేయాలని దరఖాస్తులు పెట్టుకున్నారు. వారి దరఖాస్తులు జిల్లా పంచాయతీ అధికారి పరిశీలనలో ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలు ఇప్పుడా?.. అప్పుడా?.. అన్నట్లు ఉండటంతో బదిలీల ప్రక్రియపై దృష్టి పెట్టలేదు. పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం ఇప్పట్లో నిర్వహించడం లేదని స్పష్టం కావడంతో బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం



స్థానిక నాయకుల నుంచి రాజకీయ ఒత్తిళ్లు ఉండటం సహజమే. కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, లేదా ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు నిర్వహించనప్పుడే మాత్రమే బదిలీలు చేపట్టి, వారి స్థానంలో ఇతరులను నియమిస్తాం. అన్ని మండలాల నుంచి బదిలీల దరఖాస్తులు వస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

\- డీపీవో పార్థసారథి

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

- జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట సంత బజారు ప్రాంగణంలో ఘటన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ, ఎస్ఐ

6

వృద్ధ దంపతులపై దాడి

- జోగులాంబ గద్వాల జిల్లా చెనుగోనిపల్లి గ్రామంలో ఘటన

6

జూలపల్లి అటవీ సెక్షన్ అధికారి సస్పెన్షన్

- రూ.లక్షలు విలువ చేసే కలప అక్రమ రవాణా
- విచారణలో అవినీతి బయట పడటంతో వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మదాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలోని జూలపల్లి అటవీ సెక్షన్ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. జూలపల్లి, కొండాపూర్ అటవీలో లక్షల రూపాయల విలువ చేసే కలపను అక్రమంగా రవాణా చేసిన విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దాంతో అధికారులు విచారణ చేపట్టారు. మహ్మదాబాద్ రేంజ్ అధికారి అబ్దుల్ హై, ఆమల్‌గల్ అటవీ ఆధికారులు మూడు నుంచి నాలుగు రోజుల పాటు సమగ్ర విచారణ చేసి, నివేదికను డీఎఫ్‌వోకు సోమవారం అందించారు. జిల్లా అటవీ అధికారి సత్యనారయణ ఆ నివేదికను కన్జర్వేటర్‌కు అందించారు. ఆ నిదివేదికతో పాటు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలను అందించారు. పూర్తి స్థాయిలో పరిశీలించిన కన్జర్వేటర్ జూలపల్లి సెక్షన్ అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎఫ్‌వో సత్యనాయణ 'అంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఆంధ్రజ్యోతి అందిస్తుంది అద్భుతమైన
ఉద్యోగ అవకాశం
సేల్స్ రిప్రజంటెటివ్స్ (SR)
వేతనం : 17,750/- (అలవెన్స్‌ల తో కలుపుకొని)
విద్యార్హత : 10 పాస్ / ఇంటర్
వయస్సు : 20 - 35
అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును, కొత్త వారికి కూడా అవకాశం కలదు.
పని చేయాల్సిన కేంద్రాలు
శాంతినగర్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్
ఇంటర్వ్యూ తేది: 19-03-2025 బుధవారం
సమయం : ఉదయం: 10:30 గంటల నుంచి మ: 1:30 గంటల వరకు
అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చే విధంగా పనిచేయవలసి ఉంటుంది.
సేల్స్ రంగంపై ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.
ఆంధ్రజ్యోతి కార్యాలయం:
తిరుమల హిల్స్, గ్రా., అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్.
డిప్యూటి సర్క్యులేషన్ మేనేజర్ సెల్: 99854 11170

పది పరీక్షలకు ఏర్పాట్లు

- మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాలు..
- హాజరుకానున్న 13,038 మంది విద్యార్థులు
- ప్రైవేట్ స్కూల్స్ హాల్ టికెట్స్ ఇవ్వకున్నా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ఎ.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాల సిద్ధం చేశామని, ఒత్తిడికి గురవకుండా నిపుణులతో కెరియర్ గైడెన్స్ ఇప్పించామని తెలిపారు. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల కోసం 60 కేంద్రాలు ఏర్పాటు చేశామన్న ఆయన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేశారా?

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశ్న పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయి. సీఎస్, డీవోలకు శిక్షణ ఇచ్చాం.

ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు?.. ఎంతమంది హాజరు కానున్నారు?

జిల్లాలో 60 కేంద్రాలు ఏర్పాటు చేశాం. 13,038 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 12,749 మంది, ప్రైవేట్ విద్యార్థులు 269 మంది ఉన్నారు.

నిమిషం ఆలస్యం అయితే అనుమతి ఉండదన్న నిబంధన ఉందా?

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. అర గంట ముందే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. విద్యార్థులు కేంద్రాలకు ముందే చేరుకుంటే ఒత్తిడికి లోనుకారు. నిమిషం ఆలస్యమైతే అనుమతించరన్న నిబంధన ఏమీ లేదు.

పరీక్షలకు ఎంత మంది సిబ్బందిని నియమించారు?

60 మంది సీఎస్‌లు, 60 మంది డీవోలను ఏర్పాటు చేశాం. 640 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. కేంద్రాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు ఉంటాయి.

కాపీయింగ్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

పరీక్షల్లో కాపీయింగ్ అన్న మాటే వినిపించకూడదని ఇప్పటికే సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లకు చెప్పాం. కాపీయింగ్ ప్రోత్సహిస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఎవరూ కాపీయింగ్‌కు పాల్పడవద్దు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. గట్టి పోలీస్ బందోబస్తు ఉంటుంది.

కేంద్రాల వద్ద ఏమేం సౌకర్యాలు కల్పించారు?


కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యాలు అన్ని శాఖల సమన్వయంతో కల్పించాం. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ ఆధర్యంలో బస్సు సౌకర్యం కూడా కల్పించారు. అన్ని కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

ఫీజులు చెల్లించలేదని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ఇవ్వడం లేదని తెలిసింది. మీ దృష్టికి వచ్చిందా?

ఆ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. విద్యార్థులను ఫీజుల పేరుతో వేధించొద్దని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ఆదేశించాం. పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ఇవ్వకున్నా విద్యార్థులు ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చు. ఇబ్బందేమీ లేదు.

కొనసాగుతున్న సహాయక చర్యలు

- ప్రమాదకర ప్రాంతంలో శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- సెగ్మెంట్ బ్లాకులు బలహీనంగా ఉన్న ప్రాంతంలో టైగర్ క్లాగ్స్ ఏర్పాటు
- డీ1 ప్రాంతంలో భయానక పరిస్థితుల్లో టీబీఎం శకలాల తొలగింపు


సెగ్మెంట్ బ్లాకులు కూలకుండా ఏర్పాటు చేసిన టైగర్ క్లాగ్స్

దోమలపెంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం కాలువ(ఎస్ఎల్‌బీసీ) పనులు సహసోపేతంగా కొనసాగుతున్నాయి. గత నెల 22న జరిగిన ప్రమాద ఘటనలో శిథిలాల కింద చిక్కుకున్న వారి ఆచూకి కోసం 12 ఏజెన్సీల సహాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి. మంగళవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద వివిధ శాఖల ధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలు సమన్వయంతో వేగంగా ముందుకు సాగుతున్నాయని, టీబీఎం శకలాలను తొలగిస్తున్నామని, ప్రతీ రోజు నిర్విరామంగా పనులు కొనసాగుతున్నాయని, అవసరమైన చోట ఎక్స్‌కవేటర్ సహాయంతో శిథిలాల తొలగింపు, లోకో ట్రైన్ ద్వారా ఇనుము శకలాలు, కన్వేయర్ బెల్ట్‌పై మట్టి, బురద, బయటకు తరలింపు కొనసాగుతుందని తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) అధికారులు టన్నెల్‌లో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి భూగర్భంలో మార్పులు, భూమి పొరల సారూప్యత, మట్టి దిబ్బలు తదితర విషయాలపై చర్చించారు.

సహసోపేతంగా సహాయక చర్యలు..

టీబీఎం సమీపంలో శిథిలాల కింద చిక్కుకున్న కార్మికుల ఆచూకీని గుర్తించేందుకు మంగళవారం మరోసారి క్యాడవర్ డాగ్స్ సొరంగంలోకి వెళ్లి డీ1 ప్రాంతంలో ఒక ప్రదేశాన్ని గుర్తించాయి. అక్కడ తవ్వకాలు చేపట్టే ప్రాంతంలో ప్రతికూల పరిస్థితులున్నాయి. 20 అడగులకుపైగా మట్టి కూరుకు పోయింది. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సిగ్మెంట్ బ్లాకులు నెర్రెలిచ్చి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రెస్క్యూ బృందాలు సింగరేణి ప్రణాళికను ఎంచుకుని ముందుకు సాగుతున్నాయి. డీ1 ప్రాంతంలో 8 చోట్ల సొరంగంపై కప్పు బలహీనంగా ఉండటంతో అక్కడ సింగరేణి టైగర్ క్లాక్స్‌ను కొండకు సపోర్టుగా ఏర్పాటు చేసి శిథిలాల తొలగింపు, తవ్వకాలు కొసాగిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న అధికారులను, కార్మికులను ప్రజలు అభినందిస్తున్నారు. సహాయక చర్యల్లో సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందం, ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్ దక్షిణ మధ్య రైల్వే టీం, జీఎస్ఐ, జల వనరులశాఖ తదితర బృందాలు పాల్గొన్నాయి.

పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నర్వ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాగునీటి నల్లాల వద్ద, వంట గదులు అపరిశుభ్రంగా లేకుండా చూసుకోవాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. మంగళవారం ఆమె నర్వ జడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. వంటకు పామాయిల్ వాడకంపై వంట ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలాంటి చెత్త నూనెలు వాడితే చర్యలు తప్పవన్నారు. తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో ఎంఈవోను శానిటేషన్ నిధులు వచ్చాయి కదా.. ఎందుకు ఇలా అపరిశుభ్రంగా ఉందని అడుగగా.. ఎంఈవో నిధులు రాలేదని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మందులు, సిబ్బంది కొరత ఉందని, వైద్యాధికారులు అవసరమని జిల్లా వైద్యాధికారి సౌభాగ్యలక్ష్మి చెప్పారు. తర్వాత యాంకి గ్రామ పాఠశాలను తనిఖీ చేశారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

క్రైం కార్నర్

మానసికంగా కుంగిపోయి మహిళ ఆత్మహత్య



బత్తుల లక్ష్మమ్మ (ఫైల్)

బిజినేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మానసికంగా కుంగిపోయిన ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకొని, నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బత్తుల లక్ష్మమ్మ (45) భర్త రామాంజనేయులు రెండేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొన్నది. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పారు. అప్పటికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు పరమేశ్, రవి ఉన్నారు. పెద్ద కొడుకు పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఫోన్లో ఎవరితో మాట్లాడుతున్నావంటూ తల్లి మందలించడంతో ఆత్మహత్యాయత్నం చేసిన బాలిక, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ మండలం, గగ్గలపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాపల శ్రీలత ఈ నెల 15న ఫోన్‌లో మాట్లాడుతుండగా తల్లి బక్కమ్మ ఎవరితో మాట్లాడుతున్నావంటూ నిలదీసింది. దీంతో క్షణికావేశానికి గురైన బాలిక ఫోన్‌ను గోడకు విసిరి పగులగొట్టింది. అదే రోజు సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబసభ్యులు గమనించి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. సంఘటనపై మృతురాలి తల్లి చాపల బక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధ దంపతులపై దాడి

గద్వాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లిలో వృద్ధ దంపతులపై గుర్తు తెలియని వక్తులు దాడి చేశారు. గ్రామానికి చెందిన కుర్వ సోమేశ్వరి, కుర్వ రాముడు భార్యాభర్తలు. వారికి సంతానం లేదు. ఆలనా పాలనా చూసుకునే వారు లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా అన్నం పెడితే తినేవారు. లేకపోతే అడ్డుక్కొని కడుపు నింపుకునేవారు. రాత్రి పూట అంగన్‌వాడీ కేంద్రం దగ్గర పడుకునేవారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచి, సమీపంలోని గుంతలో పడేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం స్థానికులు గమనించి వారి కులస్తులకు తెలిపి, ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గ్రామస్థులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

గండీడ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో లేగదూడ చనిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని కొండాపూర్ శివారులో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు చెన్నారం చెంద్రయ్య మంగళవారం తెల్లవారు జామున పొలానికి వెళ్లి గేదెలకు పాలు పితుకుకొని ఇంటికి వచ్చాడు. తిరిగి 9 గంటల సమయంలో పొలానికి వెళ్లి చూడగా, అప్పటికే చిరుత దాడి చేసి ఓ లేగదూడను చంపేసింది. తరుచూ చిరుత పులి సంచరిస్తోందని, పొలాలకు వెళ్లాలంటే తమకు భయం అవుతోందని రైతులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

మూసాపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఎస్‌ఐ ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల మండలం 44వ నెంబర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఈ నెల 15న పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎంను ఆపి తనిఖీ చేశారు. డ్రైవర్ అల్తాఫ్ మద్యం తాగి ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. అతడిని మంగళవారం ప్రత్యేక జ్యూడీషియల్ కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి ఆర్.శశిధర్ తీర్పు వెల్లడించారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

భూత్పూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని పాల్‌కొండ గ్రామానికి చెందిన కృష్ణయ్య గ్రామాల్లో తిరుగుతూ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు మార్కెట్లో అమ్ముతుంటాడు. ఇలా సేకరించిన 29.55 క్వింటాళ్ల బియ్యాన్ని భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని సిద్దాయపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ చేశాడు. ఈ విషయం తెలియడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్ మమత, ఆర్‌ఐ వెంకటేశ్ తదితరులు మంగళవారం గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కృష్ణయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యాన్ని సీజ్ చేసి జడ్చర్ల ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ చెప్పారు. డీటీ మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అత్యాచార నిందితుడికి 10 ఏళ్ల జైలు

కోయిలకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన వ్యక్తికి న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో కోయిలకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆనంద్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి, మోసం చేయడంతో ఆమె గర్భవతి అయ్యింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు ఆనంద్‌పై నేరం రుజువు కావడంతో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి మంగళవారం తీర్పు వెల్లడించారు. అలాగే బాధితురాలికి ప్రభుత్వపరంగా రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగల పట్టివేత

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను మంగళవారం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ప్రయాణికుల వద్ద సెల్‌ఫోన్లను చోరీ చేస్తుండగా పట్టుకున్నామని, వీరు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని జడ్చర్ల పోలీసులకు అప్పగించినట్లు ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగి నర్సింహులు తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా?



మామిడిమాడ గ్రామంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి (ఫైల్)

ఖిల్లాఘణపురం, మార్చి18 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలోని నిరుపేదల సొంతింటి కల కలగానే మిగిలి పోతోంది. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో చాలా గ్రామాల్లో డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి నోచుకోలేదు. మరికొన్ని గ్రామాల్లో అసంపూర్తిగానే వదిలేశారు. అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వనపర్తి జిల్లాలో ఎంపిక చేసిన 15 గ్రామాల్లో సుమారు 1,200 ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతీ మండల కేంద్రంలో ఒక హాల్, ఒక బెడ్‌రూమ్, ఒకకిచెన్, మరుగుదొడ్డితో కలిగిన నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఉగాది నాటికి వనపర్తి, ఖిల్లాఘణపురం , కొత్తకోట, మండలాల్లో నమూనా ఇళ్లను పూర్తి చేయడానికి అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు. మరో 7 మండలాల్లో స్థలభావం, ఇతర సమస్యల వల్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల్లో ఇవ్వనున్నది. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టినా రూ.7.50లక్షలు ఖర్చు అవుతుందని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు.

ప్రభుత్వాలు మారిన పేదలను పట్టించుకోరు



ప్రభుత్వాలు మారిన నిరు పేదలను పట్టించుకోరు. మా గ్రామానికి గతంలో డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు కానీ మంజూరు కాలేదు. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిన సల్కెలాపూర్ గ్రామానికి 99 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిజమైన పేదలను ఎంపిక చేయాలి.

- గోనెల రాంచందర్, ఖిల్లాఘణపురం

రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చు. ఇందిరమ్మ నమూనా ఇల్లు పూర్తయితే దానికి అయిన ఖర్చును నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తాం. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్, సరిపడా ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. మండలంలోని ఒక్కో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపిక పూర్తి చేశాం.

- విఠోబా, డీఈ, గృహ నిర్మాణ శాఖ, వనపర్తి

లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యేనా..?

గత ప్రభుత్వంలో డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం, అనంతరం గృహలక్ష్మి పథకం దరఖాస్తులు స్వీకరించి అటకెక్కించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీల పేరిట ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించింది. అనంతరం గ్రామసభలు నిర్వహించి రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల జాబితాలను అధికారులు చదివి వినిపించారు. అందులో పేర్లు లేని వారి నుంచి గ్రామసభలో మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు గ్రామసభలో అధికారులు తెలిపారు. గతంలో డబల్ బెడ్ రూమ్ నిర్మాణాలు చేసిన గ్రామాలను సైతం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. గత ప్రభుత్వంలో డబల్ బెడ్‌రూం ఇళ్లకు నోచుకోని గ్రామాలను ఎంపిక చేయకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలి. నిర్మాణ స్థలంలో మొబైల్ యాప్ ద్వారా అక్షాంశాలు, రేఖాంశాలు గుర్తిస్తు ఇంటి నిర్మాణ ప్రక్రియ సరళిని నమోదు చేయాలి. ఇందిరమ్మ ఇంటిని 400 చదరపు అడుగుల నుంచి 625 చదరపు అడుగుల వరకు ఇంటి నిర్మాణం చేసుకునే అవకాశం ఉంది. అంతకుమించి ఎక్కువ విస్తీర్ణంలో చేపడితే లబ్ధిదారులు బీపీఎల్ పరిధి దాటే నేపథ్యంలో అలాంటి వారికి ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తిస్తుందా అనే అనుమానం ఉంది. ఇంటి నిర్మాణానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా 10 ట్రాక్టర్ల ఇసుక అనుమతులు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం స్టీల్, ఇటుక, సిమెంట్ మెటీరియల్ తక్కువ ధరకు అందిస్తామని ప్రకటనలు చేసిన ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

జోగుళాంబ ఆలయ అభివృద్ధికి చర్యలు

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

» రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లంతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చిన్నా రెడ్డి, అజయ్ కల్లం

అలంపూరు మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం ఆయన రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ అజయ్ కల్లంతో సమీక్ష నిర్వహించారు. జోగుళాంబ ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ జోగుళాంబ ఆలయ అభివృద్ధి కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ సహా ఆలయ కమిటీతో ఇప్పటికే రెండు సార్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీన మరోమారు సమావేశమై అభివృద్ధి పనులపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. తక్షణ పనుల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్ ఏర్పాట్లు, ఆలయ చరిత్రకు సంబంధించిన ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని, అందుకోసం బస్‌స్టాండ్స్, రైల్వే స్టేషన్ తదితర ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని కమిటీకి ఆదేశించినట్లు తెలిపారు. అలాగే బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణం, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చీల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అజయ్ కల్లం మాట్లాడుతూ కొన్నేళ్లక్రితం మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన సమయంలో జోగుళాంబ ఆలయాన్ని వెలుగులోకి తీసుకొచ్చి, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో తన అనుభవాన్ని పంచుకున్నారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ రాఘవరెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీడ్స్ గ్రోవర్స్ సంఘం అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేశవులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



బహుమతులు అందుకున్న వారితో పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



భరతనాట్యం చేస్తున్న యువతి

» వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో యువత ముఖ్య భూమిక పోషించాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పీయూలోని లైబ్రరీ ఆడిటోరియంలో నెహరూ యువకేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2047 సంవత్సరానికి ప్రపంచాన్ని శాసించే విధంగా దేశం అభివృద్ధి చెందాలంటే యువత ముఖ్య పాత్రపోషించాలన్నారు. అంతకుముందు పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఎన్‌వైకే జిల్లా కో ఆర్డినేటర్ కోటా నాయక్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత సేవలు ప్రధాన పాత్రపోషించాలని సూచించారు. అనంతరం యువ ఉత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాల నుంచి వచ్చిన యువకులు సాంస్కృతిక కార్యక్రమాలను చేశారు. ప్రతిభ కనబరిచిన యువకులకు ప్రోత్సాహక పత్రాలు అందజేశారు.

కూలి బకాయిలు చెల్లించాలి

పెంట్లవెల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం పని చేసిన డబ్బులు కూడా ఇప్పటికీ రాలేదన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం డబ్బులు కూడా మూడు వారాల డబ్బులు పెండింగ్ డబ్బులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంత తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య



జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సంత ప్రాంగణంలో హత్య సంఘటన వద్ద విచారణ చేపడుతున్న జడ్చర్ల సీఐ కమలాకర్

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలో గుర్తుతెలియని వ్యక్తి (45) హత్యకు గురయ్యాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట సంత బజారు ప్రాంగణంలోని ఓ దుకాణం ముందు ఓ వ్యక్తి మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది. ఈ విషయంపై సమాచారం అందగానే సీఐ కమలాకర్, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ జయప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి తలను నేలకు బలంగా కొట్టడంతో రక్తగాయాలై మృతి చెందాడని ప్రాథమిక విచారణలో తేలినట్లు సీఐ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి అనంతరం హత్య జరిగి ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై జడ్చర్ల మునిసిపల్ కౌన్సిలర్ కుమ్మరిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

హిందూ సంప్రదాయాలకు పూర్వ వైభవం

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



నేరడుగం మఠంలో ముత్తయిదువులకు ఒడి నింపే కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణమ్మ

మాగనూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : హిందూ సంప్రదాయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నది మఠాధిపతులు, పీఠాధిపతులేనని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. నారాయణపేట జిల్లా, మాగనూరు మండలంలోని నేరడుగామ్ గ్రామంలోని పశ్చిమాద్రి సంస్థాన విరక్తి మఠంలో సిద్ధలింగ మహాస్వామి పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మాతృమూర్తులకు ఒడి నింపే కార్యక్రమం నిర్వహించారు. పంచమ సిద్ధలింగ మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముత్తయిదువలకు నూతన వస్త్రాలు ఇచ్చి ఒడి నింపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలో మహిళలను తల్లిగా, దేవతగా భావించే సంప్రదాయం ఉందన్నారు. కానీ యువతీ యువకులు విదేశీ సంస్కృతికి అలవాటు పడి మన సంస్కృతి సంప్రదాయాలను మరిచి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో హిందూ సంప్రదాయం ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అంతకు ముందు ఎంపీ డీకే అరుణకు మఠం తరపున పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం ఎంపీతో పాటు, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్‌రెడ్డి దంపతులు, మక్తల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధ, లక్ష్మారెడ్డి దంపతులు, నాగురావు నామాజీ, కొండయ్యలను ఘనంగా సన్మానించారు.

కస్తూర్బా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



విద్యా బోధన చక్కగా చేసిన విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో రమేష్‌కుమార్

కోడేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు గా వ్యవహరించి విద్యా బోధన చేశారని పాఠశాల కేజీబీవీ స్పెషల్ అధికారి కవిత తెలిపారు. జిల్లా విద్యాధికారిగా, మండల విద్యాధికారిగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యా బోధన చక్కగా చేసిన వారికి బహుమతులను అందజేశారు. డీఈవో రమేష్‌కుమార్ హాజరై మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి మంచి పరిజ్ఞానంతో పరీక్షలు రాయాలని సూచించారు. డీఈవోను శాలువాతో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌శర్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్, సీపీఎం నాయకుల మధ్య వాగ్వాదం

● పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు

అమరచింత, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ రవిబాబు, సీపీఎం నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన కాస్త ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సీపీఎం మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, ఆత్మకూరు సీపీఎం మండల కార్యదర్శి రాజు పలు అంశాలపై మాట్లాడేందుకు మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ రవి బాబుతో మాట్లాడగా.. తాగునీటి సమస్యతో పాటు ఎస్సీ కాలనీలో ఇంటి నిర్మాణం కోసం పెట్టుకున్న అనుమతి విషయంపై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీపీఎం నాయకులు కమిషనర్ వద్ద బల్లగుద్ది తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీంతో నా విధులకు ఆటంకం కలిగించారని తెలియజేస్తూ.. మునిసిపల్ కమిషనర్ రవిబాబు, పోలీస్ స్టేషన్‌లో నాయకులు గోపి, రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కొద్దిసేపు వ్యవధిలోనే సీపీఎం ఆత్మకూరు మండల కార్యదర్శి రాజు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనను కమిషనర్‌తో పాటు మునిసిపల్ మేనేజర్, వార్డు అధికారి కులం పేరుతో ద్వేషించారి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాజు ఎస్‌ఐకి ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఇరువురి ఫిర్యాదులు తీసుకున్నామని, ఈ విషయమై విచారణ చేపడుతామని ఎస్‌ఐ తెలియజేశారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలి



- కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాను. అందు కోసం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించాలని అభ్యర్థిం చాను. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థలో ఉంది. అధునా తనమైన సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతాను. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలో జేఎన్ టీయూ నుంచి టెక్నాలజీ విభాగంలో ఒక కళాశాలను ఏర్పాటు చేయాలని కోరాను. తెలకపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదించాను. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాను.

పాలమూరు కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు



- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

పాలమూరు కార్పొరేషన్ కొత్తగా ఏర్పాటై నందున అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరాం. బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. కార్పొరేషన్ పరిధిలో చాలా పనులు చేపట్టాల్సి ఉన్నందున నిధులు ఇవ్వాలని ఇప్పటికే ముఖ్యమంత్రిని కోరాం. మహబూబ్‌నగర్‌లోని చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరాము. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని అడిగాము.

రూ.20 వేల కోట్లు కేటాయించాలి



- జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

దేవరకద్ర నియోజవర్గ అభివృద్ధికి రూ. 20 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. విద్య, వైద్యం, వ్యవసాయం కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాను. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్లుగా ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. నియోజవర్గంలో డిగ్రీ కళాశాల, ప్రతీ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు, ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతాను. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కర్వెన రిజర్వాయర్‌ను పూర్తి చేసి నియోజవర్గంలోని ప్రతీ మండలానికి తాగు, సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాను శంకర సముద్రం, కోయిల్ సాగర్‌ల ద్వారా సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరుతాను.

నూతన రిజర్వాయర్లు మంజూరు కావాలి



- తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి

వనపర్తి నియోజకవర్గాన్ని సాగునీటితో సస్యశ్యామలం చేయాలంటే గొల్లపల్లి, బుద్ధారం స్టేజ్-2 రిజర్వాయర్లు కావాలి. వీటికి గతంలోనే ప్రతిపాదనలను పంపించాం. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాం. అలాగే ఏదుల లింక్ కెనాల్ కూడా కావాలి. పలు విద్యాసంస్థలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు అడుగుతున్నాం. పెబ్బేరు రెవెన్యూ డివిజన్, వెల్టూరు, సోలిపూర్, జంగమాయిపల్లి గ్రామాలను మండలాలుగా చేయాలని ప్రతిపాదించాం. బైపాస్ రోడ్డుకు అటవీశాఖ క్లియరెన్స్ కోరుతున్నాం.

లింకు రోడ్ల నిర్మాణానికి రూ. 300 కోట్లు



- కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

కల్వకుర్తి నియోజకవర్గంలో అనేక గిరిజన తండా లున్నాయి. వాటిని ప్రధాన రహదారికి అనుసం ధానం చేయడానికి అంతర్గత రోడ్ల కోసం హైబ్రిడ్ ఎన్యునిటీ కింద రూ. 300 కోట్లు కేటా యించాలని ప్రతిపాదించాను. అదే విధంగా నియోజకవర్గంలో విద్యాభి వృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 20 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరాను. రూ. 20 నుంచి రూ. 25 కోట్ల రూపాయలు కేటాయిస్తే నియోజకవర్గంలో కేఎల్ఐ కింద చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగు నీరందుతుంది. దీనిపై కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాను.

మిషన్ భగీరథ ద్వారా దిగువ ప్రాంతంలో ఉన్న గిరిజన తండాలకు తాగునీరందడం లేదు. వారికి రక్షిత మంచినీరు కావాలని, అందుకోసం రూ. 2 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వాన్ని కోరాను. బడ్జెట్‌లో నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు తీర్చేందుకు అవసరమైన నిధులు వస్తాయని ఆశిస్తున్నా.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం



▸ బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు ▸ 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలను పంపించినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' శాసనసభ్యులతో మాట్లాడింది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వివరాలు వారి మాటల్లోనే..

- మహబూబ్‌నగర్/ నాగర్‌కర్నూల్ / భూత్పూర్/ గద్వాల న్యూటౌన్/ కల్వకుర్తి/జడ్చర్ల/ నారాయణపేట టౌన్/ మక్తల్/ వనపర్తి/ అలంపూర్ చౌరస్తా (ఆంధ్రజ్యోతి)

విద్యారంగ అభివృద్ధికి కృషి



- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్వాల

జోగుళాంబ గద్వాల జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి కృషి చేయడమే ముఖ్యం, అందు కోసం పలు కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆయుర్వేద కళాశాలతో పాటు ఇతర కళాశాలల ఏర్పాటు కోసం ప్రతిపాదనలను ప్రవేశపెడతాను. ఇరిగేషన్‌కు సంబంధించి ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల మరమ్మతుకు రూ. 130 కోట్ల మేర ప్రతిపాదనలను పంపుతున్నాం. నెట్టెంపాడుకు సంబంధించి ఆర్‌ఈ (రీవైజ్ ఎస్టిమేషన్) రూ. 600 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

వాటి విడుదలకు ప్రతిపాదనలు పెడుతున్నాను. అలాగే గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదనలు పంపిస్తున్నాను. వీటిలో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తాను.

మరిన్ని నిధులు తీసుకొస్తా



- వాకిటి శ్రీహరి మక్తల్ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మక్తల్ నియోజకవర్గానికి మరి న్ని నిధులు తీసుకువచ్చి అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తాను. నియో జకవర్గంలోని సంగంబండ, భూత్పూర్, అనుగొండ, దాదన్‌పల్లి గ్రామాలకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలను పంపించాం. నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. నియోజకవర్గంలో విద్య, ఉపాధి, వైద్యం కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

విద్యారంగానికి ప్రాధాన్యం



- చిట్టెం పర్ణికారెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

నారాయణపేట నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతిపాదనలు చేశాం. నారాయణపేట పట్టణంలోని ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.4 కోట్లు, నారాయణ పేట పట్టణంలో మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతాం. దామరగిద్ద ఎస్సీ గురుకుల పాఠశాల సింగారం చౌరస్తాలో, కోటకొండ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల మరికల్‌లో కొనసా గుతున్నాయి. వాటికి భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలను పంపించాం.

ధన్వాడ మండలంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు, మండల కేంద్రంలో డివైడర్ నిర్మాణానికి రూ. 13.50 కోట్లు కేటాయించాలని కోరుతాం. మరికల్ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు, కోయిలకొండ మండలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. వీటన్నింటికీ ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాం.

తుమ్మిళ్ల కింద రిజర్వాయర్లకు నిధులివ్వాలి



విజయుడు,ఎమ్మెల్యే అలంపూరు

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వెనకబడిన అలంపూరు నియోజక వర్గా నికి ఎక్కువ నిధు లు కేటాయించాలి. పూ ర్తిగా వ్యవసాయ రంగంపై ఆధార పడిన ప్రజలకు సాగునీరు ఆవసరం. గతంలో మా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి. అలాగే గ్రామీ ణ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, నెట్టెంపాడు ప్రాజెక్టు 99, 100 ప్యాకేజీలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరా తాను.

జడ్చర్ల మునిసిపాలిటీకి రూ.70 కోట్ల ప్రతిపాదనలు



- జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

జడ్చర్ల మునిసి పాలిటీలో రూ.70 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు చేశాను. పాలమూ రు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి పూర్తి చేయాలని ప్రతిపాదనలు పంపించాము. ఉదండాపూర్ నిర్వాసితుల పరిహారం ప్యాకేజీ అంశంలో నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

నిధుల వరద పారేనా?

(5వ పేజీ తరువాయి)

అంచనా.. రూ.2,158 కోట్లు కాగా.. దీని పూర్తికి దాదాపు రూ.350 కోట్లు అవసరం అవుతాయని అంచనాలు ఉన్నాయి.

● కోయిల్‌సాగర్ పరిధిలో ఆయకట్టు విస్తరణకు రూ.100 కోట్లు అవసరం కానున్నాయి.

● తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రూ.900 కోట్లతో చేపట్టగా, ప్రస్తుత అంచనా రూ.1197.70 కోట్లకు చేరింది. ఇందులో రూ.629.26 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ. 558.34 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అసలు కీలకమైన వల్లూరు, జూలకల్, మల్లంపల్లి రిజర్వాయర్ల ఊసే లేదు. ప్రస్తుత రేట్లను పరిగణలోకి తీసుకుంటే రూ.1,500 కోట్లు దాటే అవకాశం ఉంది.

● గట్టు ఎత్తిపోతల పథకానికి రూ.581 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు 204.96 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ. 362 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

● ఇక పాలమూరు-రంగారెడ్డికి సంబంధించి.. ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.55,086 కోట్లు అవసరం. కానీ ఇప్పటికీ ఒక్క ఎకరాకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా నీరంద లేదు. మళ్లీ రేట్లు పెంచితే ఆ మొత్తం రూ.80 వేల కోట్ల వరకు చేరుకుంటుందని ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు. గత బడ్జెట్‌లో రూ.1,285 కోట్లు పీఆర్ఎల్ఐకి ప్రభుత్వం కేటాయింపులు చేసింది. కానీ ఇక్కడ పనులు అత్యంత నెమ్మదిగా నడుస్తున్నాయి. కీలకమైన ఉదండాపూర్ నిర్వాసితుల పరిహారంపై ఇంకా సందిగ్ధం ఉంది. వీటితో పాటు కొత్త రిజర్వాయర్లు, లిఫ్టులను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు.

● సీఎం సొంత నియోజకవర్గంలోని నారాయణ పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి 2024 ఫిబ్రవరి 21న సీఎం శంకుస్థాపన చేశారు. మొదటి దశ టెండర్లు పూర్తయ్యాయి. రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పినా.. ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఈ బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తేనే ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంది.

అభివృద్ధి.. సంక్షేమం.. నిర్వహణ కావాల్సిందే?

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా ఆరు గ్యారంటీలతోపాటు పలు హామీలను ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో రుణమాఫీ, బోనస్, రైతు భరోసా, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పెంపు తదితరాలు అమలవుతున్నాయి. అయితే ఇంకా మహాలక్ష్మి పథకం అమలు కావడం లేదు. అలాగే కొత్త పించన్ల మంజూరు నిలిచిపోయింది. వికలాంగులు, వితంతువులు, ఇతర భృతి పొందే వారు వీటి కోసం ఎదురుచూస్తున్నారు. పించన్ల పెంపును కూడా అమలు చేయాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం లాంఛనంగా ప్రారంభించినప్పటికీ.. ఇప్పటివరకు కార్యాచరణ మొదలు కాలేదు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు అయినప్పటికీ.. బడ్జెట్‌లో ఈ పథకానికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. కొత్త టూరిజం పాలసీ అమల్లోకి వస్తే.. నల్లమల ఫారెస్ట్ ఎకో టూరిజం, రివర్, ఆధ్యాత్మిక టూరిజానికి నిధులు అవసరం ఉంది. ఇక పాలమూరు యూనివర్సిటీకి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా చేస్తున్నారు. గతేడాది రూ. 11 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఏడాది దాదాపు రూ.200 కోట్లకు అంచనాలు పంపించారు. ఇంజనీరింగ్, లా కాలేజీ మంజూరు కాగా.. వాటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈసారి పీయూకు బడ్జెట్‌లో కేటాయింపులు అధికంగా ఉండాలనే అభిప్రాయం ఉంది. అలాగే గురుకులాల, ఇతర విద్యా సంస్థలకు శాశ్వత భవనాలు, రోడ్లు, మునిసిపాలిటీల అభివృద్ధికి కూడా ఎమ్మెల్యేలు నిధులను ఆశిస్తున్నారు.

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయి పోటీలకు దామోదర్



ఆల్‌ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికైన దామోదర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహ బూబ్‌నగర్ జిల్లా కేం ద్రంలోని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే ఇండి యా విద్యార్థి దామోదర్ ఆలిండియా చాంపియ న్ షిప్ పోటీలకు ఎంపి కయ్యారు. ఇటీవల హై దరాబాద్‌లో నిర్వహిం చిన రాష్ట్ర స్థాయి కరాటే టోర్నీలో ఆయన ప్రథ మ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. హైద రాబాద్‌లో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న ఆలిండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని మాస్టర్ శివకుమార్ తెలిపారు. దామోదర్‌ను జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ కృష్ణయ్య అభినందించారు.

ఖోఖో రాష్ట్ర జట్టుకు బి.పుష్ప ఎంపిక



రాష్ట్ర ఖోఖో మహిళ జట్టుకు ఎంపికైన బి.పుష్ప

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని, రాంనగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న బి.పుష్ప ఖో ఖో రాష్ట్ర మహిళా జట్టుకు ఎంపిక య్యారు. న్యూఢిల్లీలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉమెన్స్ ఖోఖో టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ఆమె పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను ప్రధానోపాధ్యాయిని అంజలీదేవి, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభి నందించారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయొద్దు

▸ ఎట్టిధార్‌పల్లి గ్రామస్థుల ఆందోళన

▸ పెద్దల సమక్షంలో మూకుమ్మడి తీర్మానం



ఇసుక తరలింపు ప్రక్రియను ఆపాలంటూ చేసిన తీర్మానం ప్రతిని అధికారులకు ఇస్తున్న గ్రామస్థులు

తాడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మా గ్రామం పరిధిలోని దుందుభీ వాగులో ఇసుక రీచ్ ఏర్పాటు చేయొద్దని నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని ఎట్టిధార్‌పల్లి గ్రామస్థులు స్పష్టం చేశారు. ఇక్కడ ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మంగళవారం రచ్చకట్ట వద్ద సమావేశమయ్యారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఇసుక రీచ్ ఏర్పాటుకు సహకరించాలని గ్రామస్థులను కోరారు. అందుకు వారు అంగీకరించలేదు. ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ఆత్మహత్య చేసుకుంటామంటూ కొందరు మహిళలు పురుగుమందు డబ్బాలు తీసుకొచ్చారు. ఆ సమయంలో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు, అధికారులు వారితో మాట్లాడారు. గ్రామస్థుల అనుమతి లేకుండా ఇసుక రీచ్ ఏర్పాటు చేయబోమని వారికి నచ్చచెప్పారు. అనంతరం దుందుభీ నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయకూడదంటూ పెద్దమనుషుల సమక్షంలో తీర్మానం చేసి, ఆ పత్రాన్ని ఆర్ఐ సమీర్, సురేశ్, మైనింగ్ శాఖ అధికారులకు అందిం చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ దుందుభీ నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే భూగర్భ జలం తగ్గి బోర్లు ఎండిపోతాయని తెలిపారు. దీంతో పంటలకు సాగునీరు అందదని ఆందోళన వ్యక్తం చే శారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచ కుళ్ల దామోదర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు శేఖర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, అర్జున్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభా గం/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల సర్కిల్/ వనపర్తి రూరల్/ నారా యణపేటటౌన్/ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సజావుగా కొనసాగు తున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం భౌతికశాస్త్రం, ఆర్థికశాస్త్రం పరీక్షలు నిర్వహించారు.

● మహబూబ్‌నగర్ జిల్లాలోని 36 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 10,441 మంది విద్యా ర్థులు హాజరు కావల్సి ఉండగా, 10,164 మంది హాజరయ్యారు. 277 మంది హాజరు కాలేదు. జనరల్ విభాగంలో 8,685 మందికి గాను, 8,456 మంది పరీక్ష రాశారు. 229 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,756 మందికి గాను 1,708 మంది పరీక్షకు హాజర య్యారు. మరో 48 మంది పరీక్ష రాయలేదు. .

● నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 6,165 మంది విద్యార్థుల కు గాను, 5,986 మంది హాజరు కాగా, 179 మంది గైర్హాజరయ్యారు. వారిలో జనరల్ విభాగంలో 4,865 మందికి గాను 4,708 మంది హాజ రయ్యారు. 157 మంది పరీక్ష రాయలేదు. ఒకేషనల్‌లో 1,300 మందికి, 1,278 మంది హాజరు కాగా 1,278 మంది గైర్హాజరయ్యారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 పరీక్షా కేంద్రాల్లో 3,766 మంది విద్యార్థులకు గాను, 3,644 (97 శాతం) మంది హాజరయ్యారు. వారిలో జనరల్ 3,099 మందికి, 2,997 (97 శాతం) మంది, వృత్తి విద్య 667 మందికి గాను, 647 (97 శాతం) మంది పరీక్ష రాశారు. మానవపాడు, అలంపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కన్వీనర్, డీఐఈవో హృదయరాజు పరిశీలించారు.

● వనపర్తి జిల్లాలో 6,012 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 5,860 (97.47 శాతం) మంది హాజరయ్యారు. 152 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 5,035 మంది హాజరు కావాల్సి ఉండగా 4,921 మంది పరీక్ష రాశారు. 114 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 977 మంది హాజరు కావాల్సి ఉండగా, 939 మంది హాజరయ్యారు. 38 మంది పరీక్ష రాయలేదు.

● నారాయణపేట జిల్లాలో 3,997 మంది విద్యార్థులకు గాను, 3905 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జనరల్ 3,447 మందికి గాను 3,375 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కాగా, 72 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 550 మందికి గాను, 530 మంది పరీక్షలు రాశారు. 20 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : ఎంఈవో

తిమ్మాజీపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో విలువైంది, పవిత్రమైంది ఉపాధ్యాయ వృత్తి అని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి అన్నారు. తిమ్మాజీపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న జక్క శ్రీనివాస్‌రెడ్డి అనే ఉపాధ్యాయుడు మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని అన్నారు. విద్యార్థినులు తమ ఆటపాటలతో పలువురిని అలరింపజేశారు. విరమణ పొందిన ఉపాధ్యాయునికి పూల మాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

అంతకు ముందు విరమణ పొందిన శ్రీనివాస్‌రెడ్డి 16వేల విలువైన సౌండ్ బాక్సును పాఠశాలకు అందజేశారు.



సదా మీ సేవలో..

అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	:8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.

సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

ఇంటర్వ్యూ..

పది పరీక్షలకు ఏర్పాట్లు

» ఎంఈవో మురళీకృష్ణ



చిన్నచింత కుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు ఎంఈవో మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

మండలంలో పరీక్ష కేంద్రాలు ఎన్ని?

మండలంలో వడ్డెమాన్, చిన్నచింతకుంట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. 9 గంటలకే పరీక్ష ప్రారంభమవుతోంది. విద్యార్థులు 8.30 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలి.

ఎంత మంది పరీక్షలు రాస్తున్నారు?

చిన్నచింతకుంట పరీక్ష కేంద్రంలో 240, వడ్డెమాన్ పరీక్ష కేంద్రంలో 218 మంది, మొత్తం 458 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

మౌలిక వసతులు కల్పించారా?

పరీక్షా కేంద్రాల్లో లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఇతర ఏ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

చిన్నచింతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెమాన్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వట్టెం రాజేశ్వరి రాములు ప్యాడ్లు పంపిణీ చేశారు. హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

చిన్నచింతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నవడ్డెమాన్ గ్రామంలో మంగళవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆకలి బువ్వా సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు మోయిన్ చీరలు పంపిణీ చేశారు. సేవా సమితీ వ్యవస్థాకుడు రాజేందర్, నాయకులు వెంకటేష్, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ కింద రూ.4 లక్షలు

కోయిలకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.4 లక్షలతో విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లినట్లు ఎంఈవో వెంకటజీ తెలిపారు. గత సంవత్సరం గార్లపాడ్ ఉన్నత పాఠశాలకు పీఎం శ్రీ మంజూరు కాగా, ఈ సంవత్సరం కోయిలకొండ ఉన్నత పాఠశాలకు మంజూరైనట్లు ఎంఈవో తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి

గండీడ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లుతో పాటు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో దేవన్న సూచించారు. మంగళవారం మండలంలోని వెన్నాచేడ్ శివారులో ఉపాధి కూలీ పనులను పరిశీలించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కోయిలకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ముందుకెళ్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని గార్లపాడ్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్ నాయకులు సత్యపాల్‌రెడ్డి, శ్రీపాద్‌రావు, రామస్వామి, వెంకటరెడ్డి, దస్తగిరి, శ్రీహరిగౌడ్, గోపాల్, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి కుర్చీల వితరణ

నవాబ్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల హెచ్ఎంలు 70 కుర్చీలు వితరణ చేసినట్లు ఎంఈవో నాగ్యానాయక్ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

నవాబ్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో జయరాములు, ఏపీవో జ్యోతితో కలిసి పరిశీలించారు. కూలీలకు పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి సుశ్మను ఆదేశించారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు

నవాబ్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విక్రయానికి పెట్టిన ఓయూ భూములను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు ఇర్ఫాన్, ఫయాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు తరలివెళ్తున్న వారిని మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

పీయూకు అధిక నిధులు కేటాయించాలి

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పీయూకు అధిక నిధులు కేటాయించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పీయూలోని తన చాంబర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే యూజీసీ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలో కొత్త కోర్సుల ఏర్పాటు నిధులు మంజూరు చేయాలన్నారు.

నేటి నుంచి సాయిబాబా బ్రహ్మోత్సవాలు

» 2008లో బాబా మందిరం ఏర్పాటు

» నాటి నుంచి నేటి వరకు ప్రతీ గురువారం అన్నదాన కార్యక్రమం



సాయిబాబా మూల విరాట్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 5 గంటలకు కాగడ హారతి, మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, గౌరిపూజ స్వస్తిపుణ్యావాచనం, నాందీ సమారాధన, ఋత్విక్‌వరణం, రక్షాబంధనం, అష్ట దిక్పాలక మరియు ప్రధాన కలశపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 20న ఏకాదశ రుద్ర పారాయణంలో అష్టోత్తర క్షీర కుంభాభిషేకం, పుష్పార్చన, నైవేద్యం, మహా మంగళహారతి, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించనున్నారు. 21న నవగ్రహ పూజ, అమ్మవారికి అభిషేకం, సంధ్యాహారతి నిర్వహించనున్నారు.

2008లో చిన్న మందిరంగా ఏర్పడి..

మహబూబ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో చిన్న మందిరాన్ని నిర్మించి 2008 మార్చి 15న బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తుల సహకారంతో 2008 జూన్ నుంచే ప్రతీ గురువారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రారంభంలో 30 కిలోల బియ్యంతో మొదలైన అన్నదాన కార్యక్రమం.. నేడు 150 కిలోల బియ్యంతో అన్నదానం చేస్తున్నారు. 30 మంది సేవదళ్ సభ్యులు అన్నదాన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటూ స్వామి వారికి సేవలు అందిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో నవనాగులను ప్రతిష్ఠించడంతో సంతానం లేని వారు 9 మంగళవారాలు నవనాగులకు పూజలు నిర్వహించి సంతాన ప్రాప్తి పొందారు.

సకల దేవతా మూర్తుల విగ్రహా ప్రతిష్ఠ..

2014లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సకల దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాశీవిశ్వేశ్వర శివలింగం, జ్ఞాన సరస్వతి, అన్నపూర్ణేశ్వరి, ఆంజనేయ స్వామి, అభయంజనేయ స్వామి, సుబ్రమణ్యేశ్వర స్వామి, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. నాటి నుంచి ప్రతీ రోజు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

» అధికారుల సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి : మండలంలోని ప్రతీ గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలన్నారు. రైతులు సాగు చేసుకున్న పంటలకు విద్యుత్ కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం డోకూర్ గ్రామంలో ఎండిపోయిన వరి పంటను కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

శిశుగృహలో ఇంటి వాతావరణం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) : శిశుగృహలో ఉండే పిల్లలు ఇంటి వాతావరణంలో పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఫెర్నాండేజ్ ఫౌండేషన్ మెడికల్ బృందం, జనరల్ ఆసుపత్రి, ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో శిశు గృహలో నిర్వహించిన వైద్య శిబిరానికి కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. శిశు గృహలో ఉండే చిన్నారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, వారికి అవసరమైన వైద్యసేవలు కూడా ప్రతిరోజు అందేలా చూస్తున్నామన్నారు. ఫెర్నాండేజ్ ఫౌండేషన్ నిర్వాహకులు పోలేటి తేజా ప్రతాప్ మాట్లాడుతూ శిశు గృహలోని చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్ కుమార్‌సింగ్, సీడీపీవోలు శైలశ్రీ, రాధిక, ఏసీడీవో వెంకటమ్మ, డీసీపీవో నర్మద పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు శిక్షణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం సమగ్ర శిక్ష, అంలికో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, కలెక్టర్ పాల్గొన్నారు. ఇక నుంచి వారానికి రెండు సార్లు భవిత సెంటర్లలో ఫిజియోథెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. డీఈవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ భవిత సెంటర్ల ద్వారా చదివే విద్యార్థులకు స్టైఫండ్, ఎస్కాట్ అలవెన్స్ వస్తుందన్నారు. సీఎంవో బైకాని బాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.

డిజైన్ ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ప్రకారమే లబ్ధిదారులకు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణంపై నాక్‌లో గృహ నిర్మాణ శాఖ ద్వారా ఆరు రోజుల పాటు శిక్షణ పొందిన 14 మంది మేస్త్రీలకు తన క్యాంపు కార్యాలయంలో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైద్యం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు

పాలమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే అమలు చేయాలి. మోదీ తెచిచన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ మొబైల్ సెంటర్స్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 48 గంటల ధర్నా ముగిసింది. మంగళవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు ధర్నాలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కిల్లె గోపాల్, ఆర్.రాంరెడ్డి, అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు సరోజ, ఉపాధ్యక్షురాలు కమల, గౌసియా, ప్రభావతి, అనురాధ, సత్యమ్మ మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడంలో భాగంగానే కేంద్రం మొబైల్ సెంటర్‌ను, బడ్జెట్ తగ్గించిందన్నారు. ఈ సందర్భంగా 48 గంటల ధర్నాను విరమించారు.

అగ్రవర్ణాల పేదలకు రూ.1000 కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు జహీర్‌అక్తర్

మహబూబ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూ.6000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడం అభినందనీయమని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్ అన్నారు. అదే విధంగా అగ్రవర్ణాలలోని పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటాలో అదనంగా రూ.1000 కోట్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ బీసీ వర్గాలను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం రేవంత్ బీసీ గణన చేపట్టడంతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజె బెనహర్, బెక్కరి మధుసదన్‌రెడ్డి, రాములు యాదవ్, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ మహాసభ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు

పాలమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచార్య జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్యతో కలిసి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ అధికారికంగా అమలు చేయటానికి పార్లమెంట్‌లో చట్టం చేసి కార్యరూపం దాల్చాలన్నారు. దానికోసం షెడ్యూల్ 9లో పొందుపరచాలన్నారు. ఆర్టికల్ 31లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుమ్మరి సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, పద్మశాలి సంఘం అధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, ఆర్యమరాఠా సంఘం అధ్యక్షుడు జాజం సుబ్రహ్మణ్యం, అంజయ్య, ప్రభాకర్, హరిప్రసాద్, బిక్షపతి పాల్గొన్నారు.

93 శాతం పంచాయతీ పన్ను వసూలు

కోయిలకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ పంచాయతీలో 2024-25 మార్చి నాటి వరకు 93శాతం పన్ను వసూలు చేయడం జరిగిందని ఎంపీవో నసీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 44 గ్రామ పంచాయతీలో 21 పంచాయతీల్లో వందశాతం, 20 పంచాయతీల్లో 95శాతం వరకు వసూలు చేసినట్లు తెలిపారు. గిరిజన తండాలో వందశాతం పన్ను కట్టి సహకరించారని, చిన్నలింగాల్‌చేడ్, కోయిలకొండ, అంకిళ్లలో పన్ను వసూలులో వెనుకంజలో ఉన్నామని తెలిపారు.

నిర్భయంగా పరీక్షలు రాయాలి

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులంతా నిర్భయంగా పరీక్షలు రాయాలని మునిసిపల్ కమిషనర్ కోనేటి పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి సూచించారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు అందచేశారు. హెచ్ఎం చంద్రకళ, కౌన్సిలర్ రఘురాంగౌడ్, మాజీ ఎంపీపీ నిత్యానందం, కాంగ్రెస్ నాయకులు అశోక్‌యాదవ్, నర్సిములు, ఉపాధ్యాయులు గోపాల్, ఇబ్రహీం, సునీల్, శంకర్‌బాబు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్ పట్టా నిలిపివేయాలి

నవాబ్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఖబ్రస్థాన్ పట్టా నిలిపివేయాలని మసీదు కమిటీ చైర్మన్ ఖాదర్, మార్కెట్ డైరెక్టర్ మీరోద్దిన్, ఖాజఅలీ మంగళవారం డీటీ సువర్ణకు ఫిర్యాదు చేశారు. మండలంలోని యన్మనగండ్ల శివారులోని సర్వే నెంబర్ 801ను 1958లో పట్టాదారు ఖబ్రస్థాన్‌కు దానం చేశారని, అట్టి భూమిని మేం వారసులమంటూ కొందరు పట్టా చేయాలని అధికారులను కలుస్తున్నారని వారికి ఎట్టి పరిస్థితుల్లో పట్టా చేయరాదని వారు కోరారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో 50 మంది వలంటీర్లతో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ వేడుకలకు పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రవీణ పాల్గొని, బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో 12 అడుగుల వెడల్పు, 40 అడుగుల పొడువు, 5 అడుగుల లోతుతో అతిపెద్ద కంపోస్ట్ ఎరువు తయారు చేసుకునేందుకు గుంతను తవ్వి, గార్డెన్‌లో ఎండిన ఆకులు, చెత్తచెదారంను కంపోస్ట్ ఎరువు తయారీ కోసం వేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద, పూర్వ వలంటీర్లు రమాదేవి, సాయికుమార్, స్వామి, నారాయణ, రాహుల్ పాల్గొన్నారు.

నేడు 'ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్' కార్యక్రమం

» పదో తరగతి విద్యార్థుల సందేహాలకు డీఈవో ప్రవీణ్‌కుమార్ సమాధానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు బుధవారం 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టనుంది. ఇందులో జిల్లా విద్యా శాఖాధికారి ప్రవీణ్‌కుమార్ నేరుగా సలహాలు, సూచనలు చేస్తారు. విద్యార్థులు ఏమైన సందేహాలు ఉంటే ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల మధ్య సెల్ నెంబర్లు 7995087600, 9441141359 కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్ పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్, మార్చి 18 (ఆంధజ్యోతి) : పాలమూరు కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్స్‌ను వందశాతం పూర్తిచేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈనెలాఖరులోగా రెన్యూవల్స్ పూర్తిచేయాలని లేదంటే ఏప్రిల్ 1నుంచి 25 శాతం జరిమానా పడుతుందన్నారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో జవాన్‌లు, శానిటరీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో రూ.1.25 కోట్లు ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.25 లక్షల వరకు మాత్రమే రెన్యూవల్ ఆదాయం వచ్చిందని, మిగతా ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయాలని అధికారులను ఆదేశించారు.

నగరంలో ఎస్పీ పర్యటన

మహబూబ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ జానకి పాలమూరు కార్పొరేషన్‌లో పర్యటించారు. ఎవరికీ చెప్పా పెట్టకుండా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ మంగళవారం సాయంత్రం రాంమందిర్ చౌరస్తాకు వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు అక్కడికి పరుగులు తీశారు. కాలనీలో ఎస్పీ ప్రజలతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకే పోలీసులు ఉన్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి రక్షణ కల్పించేందుకు పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. కాలనీలలో అసాంఘిక కార్యలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టానికి రూపకల్పనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమేనని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ అన్నారు. జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టానికి రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

గండీడ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక సోమవారం ప్రజావాణిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు చేయడం సబబుకాదన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3.50 కోట్ల నిధులతో సీసీరోడ్లు పనుల కోసం నిబంధనల మేరకే ప్రభుత్వానికి ఒక్క ట్రిప్‌కు రూ.600 డీడీ కట్టి ఇసుకను తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గోపాల్, రవీందర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

గండీడ్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న ఎల్‌టీ రుణాలు, క్రాప్ లోన్స్ సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లతో సర్వసభ్య సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌టీ లోన్స్ రికవరీ, క్రాప్ లోన్స్ రెన్యూవల్, వాయిదా దాటిన ఎల్‌టీ లోన్స్ వసూలు చేయుటకు లీగల్ నోటీస్ ఇచ్చేందుకు పాలకవర్గం తీర్మానం చేశారు. రైతులకు సకాలంలో లోన్స్ అందించాలని సూచించారు. డైరెక్టర్లు మమత ప్రదీప్‌రెడ్డి, నర్సమ్మ, రాంరెడ్డి, దశరథ్ గౌడ్, చంద్రయ్య, వెంకటయ్య, అశోక్ గౌడ్, బాలస్వామి, సీఈవో ఆశన్న, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ వెంకటయ్య, సూపర్‌వైజర్ అలివేల శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నచింతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెల్లికొండి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. కార్యక్రమంలో ఎంఈవో మురళికృష్ణ, హెచ్ఎం రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో ఏప్రిల్ 6న జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా భక్తుల ఇంటి వద్దకే తలంబ్రాలు చేరవేసేందుకు టీజీఎస్ ఆర్టీసీ చర్యలు చేపట్టిందని మహబూబ్‌నగర్ ఆర్ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. ఈనెల 19 నుంచి 6 ఏప్రిల్ వరకు భద్రాచలంలోని సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ద్వారా ఒక ప్యాకెట్ రూ.151 చెల్లించి బుక్ చేసుకోవచ్చునని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలో తృతీయ బహుమతి

జడ్చర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచేందుకు కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలో జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ బహుమతికి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయని తెలిపారు. అందులో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పంపిన ప్రాజెక్టుకు తృతీయ బహుమతికి ఎంపికైందన్నారు. కళాశాలలో పెరిగే వృక్షజాతులు ఎంత మేర కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుంటున్నాయనే అంశంపై వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సదాశివయ్య నేతృత్వంలో విద్యార్థులు రవీందర్, ఇందు, మేఘన, శివసాయి, సహిస్తఅజ్మి ఆరు నెలలుగా ప్రాజెక్ట్ నిర్వహించారని పేర్కొన్నారు.

కార్మికుల చట్టం అమలు చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

పాలమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ రంగం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర మహా సభలు ఈనెల 25న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం, ఇప్పలపల్లిలో మహా సభల పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాగితాలకే పరిమితం చేస్తోందన్నారు. రాష్ట్రంలో 2009లో నిర్మాణ రంగం కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే, నేటి వరకు ఆ శాఖ కార్మికులే పరమావధిగా పనిచేయటం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాంబశివుడు, గోవర్దన్, ఊషన్న, అంజనేయులు, శేఖర్, మల్లేష్, నరసింహులు, చంద్రమౌళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.